సాక్షి నంద్యాల

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు

దేవరగట్టు దసరా బన్ని మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవ విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరాయి. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. 8లో



తరగతి గదిలోనే..

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్ నిర్మాణమవుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 8లో



ఆర్టీసీకి 'దసరా' ఆదాయం

కర్నూలు(రాజ్‌విహార్): దసరా సందర్భంగా ఆర్టీసీ నడిపిన 111 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.29.42 లక్షల ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వెంకటరామం తెలిపారు.

న్యూస్‌రీల్

కర్నూలులో మెగా సీఫుడ్ ఫెస్టివల్



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల (సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా చేపలు, రొయ్యల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా వచ్చేనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కర్నూలులోని రావూరి గార్డెన్స్‌లో మెగా సీఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి మెగా సీఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సంబంధించి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా చేపలు, రొయ్యలతో కూడిన ఆహార బఫెట్‌ను రూ. 399లకే అందిస్తున్నామని, విద్యార్థులకు 10 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో 13వ వార్డు వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ కాల్వ నాగరాజు, సరస్వతి పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడండి



రక్తదానం చేసిన పోలీసుకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మల సత్రం: రక్తదానంపై అపోహలు వీడి ఆపద సమయంలో స్వచ్ఛందంగా ముందుకు రావాలని రఘువీర్ రెడ్డి సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన వారు ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. రక్తదానం చేసిన 220 మందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, ఏఆర్ ఏఎస్పీ చంద్రబాబు, ఏఆర్‌డీ ఎస్పీ రంగముని, రెడ్ క్రాస్ నంద్యాల చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్ పాల్గొన్నారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.8.90 లక్షలు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రానికి శనివారం ఒక్క రోజు వివిధ సేవల ద్వారా రూ.8,90,681 ఆదాయం వచ్చింది. శ్రీలక్ష్మీ ఘణ మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.8,90,681 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. అవుకు గ్రామానికి చెందిన రామకృష్ణుడు ఆలయ అభివృద్ధికి రూ. 1లక్ష విరాళంగా అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన మద్దిలేటి కేజీ వెండి హారతులను బహూకరించారు.

నంద్యాలలో రూ.98.55 లక్షలతో కలెక్టరేట్

కర్నూలు (న్యూసిటీ): నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లాలో కలెక్టరేట్ భవన నిర్మాణానికి రూ.98.55 లక్షల నిధులు మంజూరయ్యాని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని, అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోద ముద్ర లభించిన వెంటనే భవన నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.

అవస్థలు కనుమరుగు

- ప్రభుత్వ పాఠశాలల్లో పక్కగా టాయిలెట్ల నిర్వహణ
- క్రమం తప్పకుండా క్లీనింగ్ సామగ్రి సరఫరా
- జిల్లాలో 1,488 మంది ఆయాల సేవలు
- ఒక్కొక్కరికి నెలకు రూ. 6 వేల గౌరవ వేతనం



ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధునిక టాయిలెట్లు



మరుగుదొడ్లను శుభ్రపరుస్తున్న ఆయాలు

ఆళ్లగడ్డ: సర్కారు బడుల్లో చేపట్టిన విప్లవాత్మక మార్పులతో విద్యా ప్రమాణాలు పెరగడంతో పాటు మౌలిక వసతుల మధ్య విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. నాడు – నేడు మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. వసతుల కల్పనలో ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు నేడు క్లీన్‌గా.. నీటుగా .. దర్శనమిస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను ఆధునీకరించిన ప్రభుత్వం టాయిలెట్ల నిర్వహణకు పక్కా ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలో 1,368 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1.34 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల పరిసరాల పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు 300 మంది విద్యార్థుల వరకు ఒకరు, 301 నుంచి 600 విద్యార్థులు ఉంటే ఇద్దరు, 601 నుంచి 900 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు, 900 మంది విద్యార్థులకు పైగా ఉంటే నలుగురు ఆయాలను నియమించారు. ఈ విధంగా జిల్లాలో 1,488 మంది ఆయాలను నియమించారు. వీరికి నెలకు రూ. 6 వేలు గౌరవ వేతనం మేరకు రూ.89.28 లక్షలు ఖర్చు చేస్తోంది. ఉదయం పాఠశాలలకు విద్యార్థులు వచ్చేసరికి ఆయాలు టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నాడు ఇబ్బందులు

గతంలో ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు ఉంటే నీళ్లుండేవి కావు. నీళ్లు ఉంటే.. తలుపులుండవు! రెండు ఉన్నా నిర్వహణ లేక కంపు కొడుతుండటంతో వెళ్లలేని దుస్థితి. అత్యవసర పరిస్థితుల్లో చెట్ల పొదలు, గోడ చాటే గతి. చాలా మంది సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాతే. పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో చదువుకు స్వస్తి పలికిన బాలికలు చాలా గ్రామాల్లో ఎంతో మంది ఉన్నారు. తరగతి గదులు శుభ్రపరిచేందుకు విద్యార్థులు రోజు ఇద్దరు, ముగ్గురు చార్ట్ వేసుకునే పరిస్థితి. అరకొర ఆయాలను నియమించినా ఏడాదికోసారి వేతనాలు ఇస్తుండటంతో పాటు శుభ్రతకు ఎలాంటి సామగ్రి, రసాయనాలు ఇవ్వకపోవడంతో పెద్దగా ఫలితం ఉండేది కాదు.



ఆధునిక వసతులతో సౌకర్యంగా తీర్చిదిద్దిన టాయిలెట్

నేడు సౌకర్యాలు

సౌకర్యాల నడుమ పేద విద్యార్థులు చదువులు కొనసాగించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలను తలపిస్తున్నాయి. నాడు-నేడు కింద మౌలిక వసతులు మెరుగుపడి శ్రద్ధగా చదువుకుంటున్నారు. శుభ్రమైన ఆధునిక టాయిలెట్లు కార్పొరేట్ కార్యాలయంలో ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులను, టాయిలెట్‌లను నిత్యం శుభ్రంగా ఉంచేందుకు ఒక్కో పాఠశాలకు ఒకరి నుంచి నలుగురు ఆయాలను నియమించారు. ఒక్కో ఆయాకు నెలకు రూ. 6 వేలు గౌరవ వేతనం ఇస్తున్నారు. దీంతో నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల డ్రాపౌట్స్ శాతం తగ్గుతూ వస్తోంది.

ప్రభుత్వ చొరవను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు.

శుభ్రతకు పెద్దపీట

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు 15,748 లీటర్ల బాత్‌రూమ్ క్లీనర్ ద్రావణం, 20 వేల లీటర్ల ఎయిర్ ఫ్రెష్నర్ ద్రావణాన్ని ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసింది. దీంతో పాటు పాఠశాలకు అవసరమైన బాత్ రూం బకెట్లు, జగ్గులు, చెత్త సేకరణకు అనువైన బకె ట్లు, స్ప్రే బాటిళ్లు, బ్రెస్‌లు, ఆయాలకు సేఫ్టీ జాకెట్లు, గౌస్‌లు, చేతులు శుభ్రం చేసుకుని ఆయిల్, సోప్‌లు సమకూర్చింది. పాఠశాల ఆవరణను శుభ్రపరచడంతో పాటు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాఠశాలల వాతావరణం ఆహ్లాదకరంగా కనిపిస్తోంది.



శుభ్రపరిచే క్లీనర్లు, కెమికల్స్



ఆయాలకు టాయిలెట్ క్లీనర్లు, గ్లౌస్‌లు, సేఫ్టీ జాకెట్లు అందజేస్తున్న అధికారులు

నెలనెలా జీతం



నేను గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆయాగా పనిచేశాను. అప్పుడు పిల్లలు తక్కువ ఉన్నారని నెలకు రూ. 800 చొప్పున సంవత్సరానికి ఒకసారి ఇస్తామని చెప్పి రెండు, మూడు నెలల జీతం ఎగ్గొట్టేవారు. బాత్‌రూంలు కడగటానికి కూడా ఏమీ ఇచ్చేవారు కాదు. వట్టి నీళ్లతోనే కడగాల్సి వచ్చేది. దీంతో కంపు గొడుతుండటంతో ఎవరూ వాడుకునే వారు కాదు. ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నెలకు రూ. 6 వేలు జీతం నెలనెలా ఇస్తున్నారు. అవసరమైన వస్తువులు, మందులు అన్ని ఇస్తున్నారు.

– షేక్షాబీ, ఆయా

వాష్ రూంలు బాగున్నాయి



చిన్నప్పటి నుంచి గవర్నమెంట్ స్కూల్‌లోనే చదువుకుంటున్నాను. అయితే గతంలో వాష్ రూం అంటే ఉదయం ఇంటి దగ్గర అయితే మళ్లీ ఇంటికి వచ్చే వరకు అలాగే ఉండేవాళ్లం. దీంతో మా ఫ్రెండ్స్‌కు చాలా మందికి కడుపు నొప్పి, ఇతర రోగాలు కూడా వచ్చాయి. అనేక మంది బడి మానుకున్నారు. ఇప్పుడు రెండేళ్ల నుంచి బాత్‌రూంలు ఇంటి దగ్గరకంటే నీట్‌గా ఉంటున్నాయి.

– తస్లీం, 7వ తరగతి, క్రిష్టిపాడు

మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణను కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. టాయ్‌లెట్లు, రెస్ట్ రూములు సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా వాటి నిర్వహణకు పెద్ద మొత్తంలో ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. వీటిని సద్వినియోగం చేసుకోవడంతోపాటు పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు సహకరించాలి.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

వాల్మీకి రచనలు ఆదర్శం



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల: మహర్షి వాల్మీకి రచనలను ఆకలింపు చేసుకుని ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు బ్రహ్మానంద రెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని శనివారం నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి నంద్యాల ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ మాబ్బునిసా, డీఆర్‌ఓ పుల్లయ్యలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆదికవి రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి చూపిన బాటలో అందరూ నడవాలని ఆకాంక్షించారు. మహా గ్రంథమైన రామాయణాన్ని రచించి భావితరాలకు మానవతా విలువలను చాటి చెప్పారన్నారు. 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని అద్భుతంగా రచించి సమస్త మానవాళికి ఆదర్శనీయులయ్యారన్నారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా మాట్లాడుతూ హిందువులకు ఆరాధ్య గ్రంథమైన రామాయణాన్ని రచించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అని కొనియాడారు. చదువులేని వ్యక్తి అయినప్పటికీ చిన్న సంఘటనతో పరివర్తన చెంది రామాయణ గ్రంథాన్ని రచించారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ వాల్మీకి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుకుంటుందన్నారు. వాల్మీకి మహర్షి 24 వేల పద్యాలను సంస్కృతంలో రచించి ఆయన ఆనాడే ఆదికవిగా పేరుపొందారున్నారు. వాల్మీకి రామాయణంలోని శ్రీరాముని ఆదర్శాలను ఆచరణగా తీసుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

మహానంది ఆలయం మూసివేత

మహానంది: రాహుగ్రస్త పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం మహానంది ఆలయం తలుపులు మూసివేశారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు అర్జున శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివారం ఆలయశుద్ధి, సంప్రోక్షణ పూజల అనంతరం ఉదయం 8 గంటల నుంచి భక్తులకు యథావిధిగా దర్శన సౌకర్యం కల్పిస్తామన్నారు. దీంతో పాటు బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీగంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి అభిషేకం, అర్చన, పూజలు నిర్వహించిన అనంతరం ఆయల తలుపులు మూసివేశారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని ఈఓ నాగప్రసాద్ తెలిపారు.



ఆలయ తలుపులు మూస్తున్న అధికారులు, పండితులు

కమనీయం... ప్రహ్లాదవరదుడి పవిత్రోత్సవం





ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, ఉత్సవాలకు పవిత్ర మాలలను తీసుకొస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున మూలవిరాట్ శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ప్రత్యేక అర్చనలు, హారతులతో పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి నవకలశ స్నపనం, ద్వారతోరణ పూజ, మండల ప్రతిష్ఠ, కుంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను నూతన పట్టు పీతాంబరాలతో ముస్తాబుచేసి పల్లకీలో కొలువుంచి మంగళ వాయిద్యాలతో మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

రబీ సాగుకు 15 వరకు అవకాశం



మాట్లాడుతున్న ఏడీఆర్ వెంకటేశ్వర్లు

నంద్యాల (సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రబీలో అన్నదాతలు ఆరుతడి పంటలు వేసుకుని ఉపశమనం పొందాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహచంచాలకులు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కలెక్టర్ కాంప్లెక్స్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలకు శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కొర్రలు, సజ్జలు, మొక్కజొన్న, పప్పు ధాన్యాలలో మినుములు, కంది, సోయా మంచి దిగుబడినిచ్చాయని పేర్కొన్నారు. రబీ సాగులో భాగంగా నవంబర్ 15 వరకు కొర్ర, కుసుమ, పొద్దు తిరుగుడు, పెసర తేలికపాటి నేలల్లో విత్తుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. నవంబర్ 15 తర్వాత ఉలవ పంటకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. శనగలో దేశీయ రకాలు ఎన్‌బీఈజీ- 452,857,776 రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి తరఫున కె.శ్రీనివాసులు, నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి తరఫున కే చెన్నయ్య, ఏరువాక కేంద్రం నంద్యాల సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ, బనవాసి కేవీకే కేంద్రం శాస్త్రవేత్త కె.సుజాతమ్మ, బనగానపల్లె కేవీకే తరఫున డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

కృష్ణమ్మ ఒడి వీడుతున్న సంగమేశ్వరుడు



కృష్ణాజలాల నుంచి బయల్పడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయం

కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో ప్రాచీన సంగమేశ్వరాలయం మరి కొద్ది రోజుల్లోనే కృష్ణమ్మ ఒడి నుంచి బయల్పడనుంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగులు కాగా శనివారానికి 845.08 అడుగులకు చేరుకుంది. దీంతో సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టాయి. కృష్ణాజలాలు సంగమేశ్వరాలయం గోపురాల నుంచి ప్రహరీగోడను తాకాయి. మరో 5 అడుగుల మేర నీరు తగ్గితే పూర్తిస్థాయిలో ఆలయం బయటపడి సంగమేశ్వరుడు భక్తులచే పూజలు అందుకోనున్నారు.

845.10 అడుగులుగా డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 845.10 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలో 70.2053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు శుక్రవారం నుంచి శనివారం వరకు 5,654 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 0.394 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, 777 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 54 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 833, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,400, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2400 క్యూసెక్కులు నీటిని వదిలారు.

క్లుప్తంగా

డీఈఎల్ఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు సిటీ: ఈ ఏడాది ఆగస్టు 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన డీఈఎల్ఈడీ(డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) థర్డ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 1,607 మంది విద్యార్థులు హాజరుకాగా 1,521 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఫలితాలు www. bse. ap. gov. in అనే వెబ్‌సైట్లో చూసుకోవచ్చునని సూచించారు.

టెక్నికల్ పరీక్ష ఫలితాలు..

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ ఏడాది జూలై 3 నుంచి 7వ తేదీ వరకు జరిగాయని, పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ లోయర్, హైయ్యర్, వీవింగ్ థియరీ పరీక్షలకు 2,691 మంది అభ్యర్థులు హాజరుకాగా 1,733 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

నేడు ఎస్సార్బీసీకి నీరు విడుదల

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు ఆదివారం నీరు విడుదల చేయనున్నట్లు ఈఈ సుభకుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 800 క్యూసెక్కుల మేర నీటిని పంపుతున్నట్లు, రైతులు అవసరమైన మేర ఉపయోగించుకోవాలని సూచించారు.

కోలుకోలేక సచివాలయ ఉద్యోగి మృతి



మృతుడు చిన్నరాజు (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గోవర్ధనగిరి సచివాలయం-1 ఇంజినీరింగ్ అసిస్టెంట్ కటికల చిన్నరాజు(32) శనివారం మృతిచెందాడు. కల్లూరు మండలం ఉలిందకొండకు చెందిన సూర్యకాంతమ్మ, సోమన్నల పెద్ద కుమారుడు చిన్నరాజు 2019 అక్టోబరులో ఉద్యోగాన్ని సాధించారు. గతేడాది తండ్రి చనిపోగా.. తల్లి, చెల్లి, తమ్ముడితో ఉంటూ కుటుంబ భారం మోస్తూ వచ్చాడు. శుక్రవారం విధి నిర్వహణ అనంతరం స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తుండగా లారీనీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకోలేక మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన సంతాపాన్ని తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కర్నూలు(అర్బన్)/నంద్యాల(న్యూటౌన్): ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు (ఉన్నత విద్యా కోర్సులు) మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రధానమంత్రి ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారిణి ఎస్ఆర్ రత్నరూత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రీయ సైనిక్ బోర్డు, రక్షణ శాఖ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు www.ksb.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో నవంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం

- సీబీఐ మాజీ జేడీ చైర్మన్ లక్ష్మీనారాయణ
- కనులపండువగా శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం
- గురువులు, డ్యామ్ ఇంజినీర్లు, ఉద్యోగులకు సన్మానం
- వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో స్పోసా గీతం నమోదు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి



స్పోసా గీతాన్ని ఆలపిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీశైలం ప్రాజెక్ట్: దేశ భవిష్యత్ పాఠశాల తరగతి గదుల్లోనే నిర్మాణమవుతుందని శ్రీశైలం ప్రాజెక్ట్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (స్పోసా) చైర్మన్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాలలో వజ్రోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రారంభమై 60 వసంతాలు గడిచిన సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు సుమారు 6 వేల మంది హాజరై వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనిషికి జ్ఞానం అవసరం అని, ఆ జ్ఞానాన్ని తల్లిదండ్రులు, సామాజిక పరిస్థితులు, గురువులు అందిస్తారన్నారు. పాఠశాలలో పుస్తక జ్ఞానమే కాకుండా గురువుల అనుభవ జ్ఞానాన్ని బోధించినప్పుడే విద్యార్థికి దిశానిర్దేశం సాధ్యమన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పడిన తర్వాత పాఠశాలకు 50 వసంతాల సమయంలో ప్రత్యేక తరగతి గదుల నిర్మాణం, పాత తరగతి గదుల మరమ్మతులు ఇతరత్రా పనులు చేపట్టడం సంతోషదాయకమన్నారు. భావితరాల ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేయాలని వేడుకలకు హాజరైన వారికి పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామం ప్రత్యేకమైనదన్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఎవరికీ భూమిపై యాజమాన్యపు హక్కులు లేని విషయం తెలుసుకుని పంచాయతీగా చేసేందుకు కృషి చేశానన్నారు. రోడ్లు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాలు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ భూమి, ఇళ్లపై యాజమాన్యపు హక్కులను అతి తక్కువ ధరకే కల్పిస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారు.

నంద్యాల జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం కోసం అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు. తాము చదువుకునే సమయంలో సరైన తరగతి గదులు లేకపోవడం, పుస్తకాలు కొనలేని పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు ఎంతో మేలు చేశారన్నారు.

ఆవిష్కరణలు.. సన్మానాలు

రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో మొదటి రోజు శనివారం ఆవిష్కరణలు, సన్మానాలతో సాగింది. వేలాది తరలివచ్చిన పూర్వ విద్యార్థులతో పాఠశాల ఆవరణ కిక్కిరిసి కనిపించింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఉత్సవాల లోగోను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, స్పోసా చైర్మన్ వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం వజ్ర సంకల్పం అనే పుస్తకాన్ని పాఠశాల పూర్వ విద్యార్థి ఈ ప్రాంతంలో తన అనుభవాలపై రాసిన 'నెమలి కన్నులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలకు చెందిన



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుతో ఎమ్మెల్యే శిల్పా, స్పోసా చైర్మన్ లక్ష్మీనారాయణ

పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అలాగే పాఠశాల గురువులను, శ్రీశైలం డ్యామ్ నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, సిబ్బంది, ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. శ్రీశైలం డ్యామ్, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణంలో భాగస్వామి అయిన కాంట్రాక్టర్ వేమారెడ్డిని స్పోసా కమిటీ ఈ సందర్భంగా సన్మానించింది.

వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డుల్లో స్పోసా గీతం

వజ్రోత్సవాలను పురస్కరించుకొని 6 వేల మంది పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, స్థానికులు, ఉద్యోగులు ఒక్కసారిగా ఆలపించిన ప్రత్యేక స్పోసా గీతం వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు చేసుకుంది.

" సదా జయము నీకే స్పోసా సుధాస్ఫూర్తి
నీవే పృథ్వీతలమున పూర్వ విద్యార్థి
దిగ్విజయాలకు శ్వాసవు నీవే
చిరుప్రాయమ్మున దొరికిన చెలిమి, పెరిగెడి
వయసుతో తరుగని కలిమి
శ్రీశైలమ్మున చదువుట తలచి, ఋణమును
తీర్చగ తరలెను స్పోసా
బడియొక గుడియను భావన తలచి,
బోధించిన గురుపాదము కొలిచి,
సాధించిన మా సమిష్టి ఫలములు తదుపరి
తరముకు పంచుట భాగ్యము
పర్వత శ్రేణి పునాదిపై నిలిచి, పచ్చని
వనముల నీడను విరిసిన
విద్యాలయమున విజయ పతాకము,
విశ్వమంతకును వెలుగుల నీడగా"



ఇంజినీర్లను సన్మానిస్తున్న స్పోసా కమిటీ సభ్యులు



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు, డ్యాం రిటైర్డ్ అధికారులు తదితరులు

బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

ఆదోని సెంట్రల్: బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ప్రభుత్వ బాలికల పాఠశాల, పురపాలక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, బోధనా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. జిల్లాలో 700 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ అయినట్లు తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో 99 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ కాగా 48 మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు. మిగిలిన వారిని కూడా పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయుల నుంచి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అలిసిద్దిఖీ ఉన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు జాతీయ అవార్డు



అవార్డుకు ఎంపికైన ఫొటో



వడ్డే శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): 'సాక్షి' కర్నూలు యూనిట్‌లో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే వడ్డే శ్రీనివాసులుకు జాతీయ అవార్డు లభించింది. నవంబర్ 1వ తేదీ ప్రపంచ ఫొటో జర్నలిజమ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడెమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అవార్డులు ప్రకటించారు. ఈ అవార్డుకు వడ్డే శ్రీనివాసులు తీసిన 'చల్లని ఐడియా' (ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక పెద్దాయన ఫౌంటేన్ కింద సేద తీరుతున్న) ఫొటో ఎంపికైంది. నవంబర్ 1వ తేదీన విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో వడ్డే శ్రీనివాసులుకు రూ.2 వేల నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు.

వచ్చే నెల 10 లోపు 'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నవంబర్ 10వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ డా.వి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో నవంబరు 16వ తేది వరకు, రూ.200 అపరాధ రుసుంతో 22వ తేదీ, రూ.500 అపరాధ రుసుంతో 30వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు రెగ్యులర్ విద్యార్థులు రూ.125, ఫెయిల్ అయిన విద్యార్థులు 3 సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు అయితే రూ.110, వొకేషన్ విద్యార్థులు రూ.60 అదనంగా, తక్కువ వయస్సు గల పిల్లలు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలన్నారు. షెడ్యూల్ కులాలు/షెడ్యుల్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు మొదటిసారి పరీక్షలకు హాజరు అవుతున్నట్లయితే వారికి ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. అయితే వారి తల్లిదండ్రుల ఆదాయం పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేలు మించకూడదని, 2.5 ఎకరాల చిత్తడి నేల/5 ఎకరాల పొడి భూమి మించకుండా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నిబంధనల ప్రకారం మండల రెవెన్యూ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తల్లిదండ్రుల ద్వారా తెప్పించుకోవాలన్నారు. పరీక్ష ఫీజుతో పాటు, వొకేషనల్ విద్యార్థులు, మైగ్రేషన్ సర్టిఫికెట్ల కోసం రుసుం ఆన్‌లైన్‌లో నామినల్ రోల్‌తో పాటు www. bse. ap. gov. in అనే వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు.

పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలి యువకుడి ప్రతిభ



రోయింగ్‌లో సత్తా చాటిన వెంకటనారాయణ

- ప్రధాని మోదీ ప్రశంస



ప్రధాని మోదీ ట్వీట్

ప్యాపిలి: పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలికి చెందిన కొంగనపల్లి వెంకటనారాయణ ప్రతిభ చాటాడు. ఈ నెల 26 నుంచి శనివారం (28 వ తేదీ) వరకు చైనాలోని హంగ్‌జోలో రోయింగ్ పీఆర్3 మిక్స్‌డ్ డబుల్ పోటీలు జరిగాయి. భారత్ తరఫున ప్యాపిలికి చెందిన వెంకటనారాయణ, రాజస్థాన్‌కు చెందిన అనిత ఈ పోటీల్లో పాల్గొన్నారు. 2 కిలోమీటర్ల దూరాన్ని 8 నిమిషాల 50 సెకన్లలో రోయింగ్ చేసిన ఈ జంట ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ పోటీల్లో భారత్‌తో పాటు చైనా, థాయ్‌లాండ్, ఉజికిస్తాన్, జపాన్ దేశాలకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. భారత్ ద్వితీయ స్థానంలో నిలవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ వెంకటనారాయణ, అనితలను అభినందిస్తూ ట్వీట్ చేశారు. ప్యాపిలి క్రీడాకారుడు అంతర్జాతీయ స్థాయిలో భారత్ తరఫున పాల్గొని ప్రతిభ చాటడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు

- నెరణికి గ్రామానికి చేరిన మాళమల్లేశ్వర ఉత్సవ విగ్రహాలు

హొళగుంద: మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో దేవరగట్టు దసరా బన్ని మహోత్సవాలు శనివారం ముగిశాయి. అంతకు ముందు కంకణ విసర్జన అనంతరం దేవరగట్టులోని కాడసిద్ధప్ప మఠంలో ఉంచిన ఉత్సవ మూర్తులకు ఆలయ పూజారులు అభిషేకం చేశారు. అనంతరం విగ్రహాలను, పల్లకీని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తుల మధ్య గొరవయ్యలు భక్తిశ్రద్ధలతో నెరణికి గ్రామానికి చేర్చారు.

గ్రామంలో పండుగ

విగ్రహాలు చేరడంతో నెరణికి గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. బన్ని ఉత్సవాలనంతరం ఈ గ్రామంలో దసరా వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దేవరగట్టు నుంచి గ్రామానికి చేరిన విగ్రహాలను ఆంజనేయస్వామి ఆలయం ముందు కొలువుంచి మహామంగళారతి ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయం నుంచి విగ్రహాలను అర్చకుల ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపులో చిన్నారులు 'బన్ని' (కర్రలు పట్టుకుని ఎగురుతూ) ఆడుతూ కనిపించారు. ప్రజలు శనివారం ముగింపు వేడుకలను ఘనంగా జరుపుకుని మల్లయ్య దీక్షను విరమించారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.



దేవరగట్టు నుంచి నెరణికి గ్రామానికి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న దృశ్యం



పల్లకీని మోసుకొస్తున్న కానిస్టేబుళ్లు

అందరి సహకారంతో ఉత్సవాలు ప్రశాంతం



దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలు అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది రెండు లక్షల మంది వరకు భక్తులు బన్ని ఉత్సవాన్ని తిలకించారు. వచ్చిన భక్తులకు తాగునీరు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాం. నెరణికి, నెరణికి తండా, కొత్తపేటతో పాటు చుట్టు పక్కల గ్రామస్తులు సంప్రదాయంగా పండుగను జరుపుకున్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం సహకరించారు.

–గుమ్మనూరు శ్రీనివాసులు, దేవరగట్టు ఆలయ చైర్మన్